క్లుప్తంగా

అంకితభావంతో విధులు నిర్వహించాలి



నూజివీడు: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజలకు ఉత్తమ సేవలు అందుతాయని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి అన్నారు. న్యాయశాఖ ఉద్యోగి జీ నాగరాజు బదిలీ సందర్భంగా శనివారం నిర్వహించిన వీడ్కోలు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తాము చేస్తున్న ఉద్యోగానికి వంద శాతం న్యాయం చేయాలన్నారు. అనంతరం నాగరాజును న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి సత్కరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాజులపాటి అంకబాబు, కోర్టు సూపరింటెండెంట్ చిట్టూరి నాగేశ్వరరావు, ఏఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



గానుగపాడు(తిరువూరురూరల్): వర్షాకాలంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జనవిజ్ఞాన వేదిక మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ సూచించారు. మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధులు–తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జలుబు, దగ్గుతో బాధపడే విద్యార్థులు పాఠశాలకు రాకుండా విశ్రాంతి తీసుకోవాలని, తద్వారా ఇతరులకు వ్యాపించకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. చెత్తాచెదారం, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, రహదారులపై పడేయకుండా కుండీలలో వేయాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి, జేవీవీ జిల్లా కార్యదర్శి రాంప్రదీప్ పాల్గొన్నారు.

టేక్ హోమ్ రేషన్ పంపిణీ

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని కలటూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్‌ను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ సులోచనరాణి ఆధ్వర్యంలో సర్పంచ్ సురేష్ లబ్ధిదారులకు రేషన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్లు కరుణ, ఎన్.వనజాక్షి పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ ఒక వరం

చాట్రాయి: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలకు వరం లాంటిదని మండలంలోని పోలవరం పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాబ్జీ మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గంపలగూడెం: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని గంపలగూడెం ఎస్సై రాంబాబు హెచ్చరించారు. గంపలగూడెం ప్రధాన రహదారిలో వాహనాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు కొందరూ వాహనానికి ముందు, వెనుక నంబర్ ప్లేట్లు లేకుండా, సినిమా హీరోలు, పార్టీల గుర్తులతో తిరగటాన్ని గుర్తించిన ఆయన సంబంధిత వాహనాలను నిలిపి కేసు నమోదు చేశారు.

సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని జీపీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో శనివారం ఏపీసీపీడీసీఎల్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణం, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల నాయకులు ఈ రెండు శాఖలకు సంబంధించిన సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. జలకళ బోర్లకు ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని నాయకులు, ప్రజాప్రతినిధులు ముక్త కంఠంతో కోరారు. అలాగే గ్రామాల్లో నూతన స్తంభాలు ఏర్పాటు చేయడం, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడం, వ్యవసాయ కనెక్షన్‌లను త్వరితగతిన మంజూరు చేయడం, జగనన్న కాలనీలకు విద్యుత్ లైన్లు లాగడం తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జలకళ బోర్లకు సాధ్యమైనంత త్వరితంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తే రైతులకు ఉపయోగపడతాయన్నారు. కొన్ని చోట్ల వ్యవసాయ విద్యుత్ రాత్రిపూట ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలా కాకుండా పగటిపూటే వ్యవసాయ విద్యుత్‌ను ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పలు మండలాల్లో విద్యుత్ తీగలు తగిలి పాడిగేదెలు, చూడి గేదెలు చనిపోయాయని వాటికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. జలకళ బోర్లకు విద్యుత్ కనెక్షన్ కోసం రైతులతో దరఖాస్తు చేయించే బాధ్యతను ఉపాధిహామీ పథకం సిబ్బంది తీసుకోవాలన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏపీ రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, విద్యా మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ మురళీమోహన్, ఈఈ సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఆగిరిపల్లి, ముసునూరు జెడ్పీటీసీ సభ్యులు వీరబాబు, ప్రతాప్, నూజివీడు ఎంపీపీ శిరీష, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు మండలాల అధ్యక్షులు రాము, శివ, నరసింహారావు, నాగవల్లేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు కోటగిరి రాజానాయన, పాట్లూరి అశోక్, పాలడుగు నాని, మచ్చా హరిబాబు, రాము, రవీంద్రరెడ్డి, కోటమ్మ పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి నాగశైలజ

నూజివీడు: సెప్టెంబరు 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా న్యాయాధికారులు, పోలీసు అధికారులు కలిసి కృషి చేయాలని 15వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఏ నాగశైలజ పేర్కొన్నారు. స్థానిక 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో శనివారం న్యాయాధికారులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ క్రిమినల్, సివిల్, వివాహ సంబంధ కేసులు, చెక్‌బౌన్స్, మోటార్ ప్రమాద పరిహారానికి సంబంధించిన కేసులు తదితర వాటిని రాజీమార్గంలో లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులను చైతన్యపరచాలన్నారు. దీనివల్ల సమయం, నగదు ఆదా అవుతుందన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ఎల్ శ్రీనివాసరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు, స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, నూజివీడు టౌన్, రూరల్ సీఐలు ఏవీవీఎస్ఎన్ మూర్తి, రాజులపాటి అంకబాబు, అడిషనల్ పీపీ ఎస్ఏ ఖాన్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలి

డీఎంహెచ్ఓ సుహాసిని



నులుపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ సుహాసిని

పటమట(విజయవాడతూర్పు): వైద్య, ఆరోగ్య సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని అన్నారు. ఆమె ఆరోగ్య కార్యక్రమాలు పరిశీలనలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి పంచాయితీలో జరుగుతున్న కంటివెలుగు, కేతన కొండలో–1లోని వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది వారికి కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ఆమె వీఎంసీ మూడు సర్కిల్ కార్యాలయాల్లో జరిగిన నులు పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌస్ పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ఏఓ టిప్పు సుల్తాన్

ఎ.కొండూరు: వ్యవసాయశాఖ అధికారులు సూచించే పద్ధతులను రైతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారి టిప్పు సుల్తాన్ పేర్కొన్నారు. మండలంలోని గొల్లమందల తండాలో శనివారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణకు తొలిదశలో అధికంగా పురుగుమందులు పిచికారీ చేయకూడదన్నారు. తెల్లదోమ పురుగు నివారణకు పత్తిపొలాల్లో పసుపు రంగు డబ్బాల్లో జిగురు పోసి ఉంచితే తెల్లదోమలు ఆ డబ్బాకు అతుక్కుంటాయని, ఈ దోమలు సోకకుండా లీటర్ నీటికి రెండు మిల్లీ లీటర్ల ట్రైజోఫాస్ ఐదు మిల్లీ లీటర్ల వేపనూనె కలిపి ఆకుల అడుగుభాగాన పడేటట్లు పిచికారీ చేయాలని సూచించారు. క్యాక్రమంలో ఏఈఓ రామచంద్రరావు, వీఏఏ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు సామూహిక నిరసన దీక్ష

గంపలగూడెం: విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల ఏడో తేదీన ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ(ఏపీవీటీయూఎస్‌సీ) ఆధ్వర్యంలో చేపట్టనున్న సామూహిక నిరసన దీక్షను విజయవంతం చేయాలని నూజివీడు డివిజన్ కార్యదర్శి ఎస్‌నాగరాజు కోరారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష కొనసాగుతుందని తెలిపారు.

మాదిగల మహాసభను జయప్రదం చేయాలి

రెడ్డిగూడెం: వచ్చే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు బిల్లుకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల చివరి వారంలో హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కూచిపూడి సత్యం కోరంరు. రెడ్డిగూడెం మండలంలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమానికి మండలంలోని కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట ధానియేల్, రెడ్డిగూడెం మండల కన్వీనర్ మల్లాది రామారావు, మండల నాయకులు నాగేశ్వరరావు, రమేష్, యోనా, ఇస్సాక్, నాగభూషణం, కోటయ్య పాల్గొన్నారు.చాట్రాయిలో సర్పంచ్ దామెర ఉషా, ఎంపీటీసీ సభ్యురాలు శివకుమారి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లను అందజేశారు.

కార్మికుల కష్టాన్ని గుర్తించని కేంద్ర ప్రభుత్వం

మైలవరం: కార్మికుల కష్టాన్ని గుర్తించని కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రతిఒక్కరూ సిద్ధపడాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్. సుధాకర్ తెలిపారు. మోదీని గద్దె దింపండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు తలపెట్టిన మహాధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ మైలవరం పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోదీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకునేందుకు మహా ధర్నాలకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, దీనిలో భాగంగా విజయవాడ అలంకార్ సెంటర్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం



గంపలగూడెంలో తల్లిపాల ఆవశ్యకతపై ప్రదర్శన

గంపలగూడెం: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యాన్నిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి తెలిపారు. గంపలగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం గంపలగూడెం–5వ అంగన్‌వాడీసెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాల వలన చేకూరే ప్రయోజనాలను గర్భిణులు, తల్లులు, బాలింతలకు వివరించారు. బిడ్డకు ఏడాది ఉండే వరకు కచ్చితంగా తల్లిపాలు పట్టాలని సూచించారు. తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ గంపలగూడెంలో ప్రదర్శన నిర్వహించారు.

ఇంటింటికీ నీటి కుళాయిలు

చాట్రాయి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హర్ ఘర్ జల్ పథకం ద్వారా ఇంటింటికి నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు జలజీవన్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ సిరిగిరి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చిత్తపూరు, ఆరుగొలనుపేట గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి పథకంపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కమిటీ వారిచే ఈ పథకం నిర్వహణ జరుగుతుందని, 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకుని పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు అప్పిరెడ్డి, రమేష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు గుర్తించాలి

తిరువూరు: విద్యార్థుల్లో రక్తహీనత, ఇతర అనారోగ్య లక్షణాలను గుర్తించాలని తిరువూరు మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మండలంలోని పాఠశాలల విద్యార్థులకు రక్తహీనత నివారణకు ఐఎఫ్ఏ మాత్రల పంపిణీ నిమిత్తం ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కల్యాణచక్రవర్తి, ఎంఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

9న మండల పరిషత్ సమావేశం

విస్సన్నపేట: మండలపరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన ఈ నెల 9వ తేదీ సాయంత్రం మూడు గంటలకు వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ శనివారం తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు మింగాలి



ఆల్బెండోజోల్ మాత్రలను అందజేస్తున్న శేషగిరిరావు, డాక్టర్ పద్మావతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులందరూ తప్పనిసరిగా నులిపురుగుల (ఆల్బెండోజోల్) నివారణ మాత్రలు మింగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విజయవాడ రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ బీఎల్‌వీ శేషగిరిరావు అన్నారు. ఈ నెల 10వ తేదీన జరిగే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గొల్లపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలను అందజేశారు. కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆర్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గొల్లపూడి, పైడూరుపాడు, రాయనపాడు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు మింగడంలో ఎటువంటి అపోహలకు తావివ్వరాదన్నారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రలు మింగాలని, దాని వలన రక్తహీనత నివారించడంతోపాటు శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఉషారాణి పాల్గొన్నారు.

గుండెపోటు నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విజయవాడ ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వైద్యులు

తిరువూరు: గుండెపోటు వచ్చినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక నాగార్జున జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు విజయవాడ ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వైద్యులు అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన వ్యక్తి చాతీపై చేతులతో బలంగా ఒత్తిడి తెస్తే రక్తప్రసరణ మెరుగుపడుతుందని, గుండె వేగంగా కొట్టుకుంటుందని కార్డియాలజిస్టు దినేష్‌కుమార్ తెలిపారు. ఆహారపు అలవాట్లు, శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడంతో చిన్న పిల్లల్లో సైతం గుండెజబ్బులు వస్తున్నాయని, రోజూ నడకతో ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు, కరస్పాండెంటు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇబ్రహీంపట్నం, జి. కొండూరు మండలాల్లో హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గెయిల్ వంటి పెట్రోలియం, గ్యాస్ సంబంధించిన కంపెనీలు ప్రమాదాలు జరిగే కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కంపెనీల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాల నివారణకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో జాతీయ స్థాయిలో జరిగిన దుర్ఘటనలపై సభ్యులతో చర్చించి అవగాహన కల్పించారు. అగ్ని మాపక సిబ్బంది సూచనలను పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించేందుకు వీలవుతుందన్నారు. సమావేశంలో డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ ఎస్.నాగమణమ్మ, ఏసీపీ కె.వి.డి.వి ప్రసాద్, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం గ్రామంలోని సీఎస్ఐ చర్చి ప్రాంతానికి చెందిన దేవరపల్లి చాందిని రెండేళ్ల కిందట ఏలూరు జిల్లాకు చెందిన కృపాకర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. చాందిని గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. కొంత కాలంగా కృపాకర్ భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేయసాగాడు. కొద్ది రోజుల కిందట చాందిని పుట్టింటికి వచ్చేయగా, కృపాకర్ తల్లి వెంకమ్మ, చెల్లెలు కరణ, పాత వీరయ్యలు వచ్చి గొడవకు దిగారు. అదనంగా కట్నం తీసుకువస్తేనే కాపురానికి తీసుకువెళ్లేదని, బెదిరింపులకు పాల్పడటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తల్లి అదృశ్యంపై కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వించిపేట టీఎస్పీ వీధి కొండ ప్రాంతంలో నోట్ల శ్రీనివాసరావు కుటుంబం నివాసం ఉంటోంది. శ్రీనివాసరావుకు వివాహం కాగా, భార్య డెలివరీ కోసం అమలాపురంలోని పుట్టింటికి వెళ్లింది. తల్లి సింహాచలం వీఎంసీలో పని చేస్తుంటుంది. ఈ నెల 3వ తేదీ ఉదయం శ్రీనివాసరావు పనికి వెళ్లి రాత్రి 9 గంటలకు వచ్చే సరికి ఇంటికి తాళం వేసి ఉంది. చుట్టుపక్కల వారిని ఆరా తీయగా అనకాపల్లి వెళ్తున్నట్లు చెప్పినట్లు తెలుసుకుని ఫోన్ చేశాడు. అయితే ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అనకాపల్లిలోని బంధువులు, స్నేహితులను విచారించగా, ఆమె అక్కడకు రాలేదని తెలిసింది. దీంతో తల్లి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రహదారిపై నిలిచి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేఉరకు జి.కొండూరు మండలం కందులపాడుకు చెందిన వై.సాంబశివరావు కందులపాడు పాలకేంద్రానికి ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. విజయ డెయిరీకి పోసే పాల డబ్బులు కోసం ప్రతి 15 రోజులకు ఒకసారి విజయవాడ వస్తుంటాడు. శుక్రవారం పాలప్రాజెక్టుకు వచ్చిన సాంబశివరావు తిరుగు ప్రయాణంలో పాముల కాల్వ వద్ద రోడ్డు మధ్యలో నిలిపి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని సాంబశివరావు తన బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో సాంబశివరావు తలకు గాయం కావడంతో పాదచారులు ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సాంబశివరావు భార్య సత్యవతి, సోదరుడు శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సాంబశివరావును 108పై విజయవాడలోకి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

16 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం శిక్షణ విభాగం కన్వీనర్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 14వ తేదీలోగా 0866 2578044లో సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.